
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 14 మే 2024





ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ యాస్మీన్‌బాషా

ప్రశాంతంగా పోలింగ్

- జిల్లాలో 73.62 శాతం నమోదు
- సమయం దాటినా కేంద్రాల వద్ద క్యూలో వేచి ఉన్న ఓటర్లు





జగిత్యాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

జగిత్యాల, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 గంటలకు జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గంలో 10.75 శాతం, జగిత్యాలలో 10.42 శాతం, ధర్మపురిలో 8.70 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 11 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 29.10 శాతం పోలింగ్ జరగగా కోరుట్లలో 29.10 శాతం, జగిత్యాలలో 30.10 శాతం, ధర్మపురిలో 28.11 శాతం జరిగింది. మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లాలో 46.96 శాతం పోలింగ్ నమోదు కాగా కోరుట్ల నియోజకవర్గంలో 47.77 శాతం, జగిత్యాలలో 45.94 శాతం, ధర్మపురిలో 47.15 శాతం నమోదైంది. మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 59.87 శాతం నమోదు కాగా ఇందులో కోరుట్ల 60.44 శాతం, జగిత్యాల 58.93 శాతం, ధర్మపురి 60.24 శాతం నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి జిల్లా వ్యాప్తంగా 73.62 శాతం ఓటింగ్ నమోదైంది. కోరుట్ల సెగ్మెంట్‌లో 73.85 శాతం, జగిత్యాలలో 73.65 శాతం, ధర్మపురిలో 73.34 శాతం పోలింగ్ నమోదు అయింది. సాయంత్రం 6 గంటల లోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు ఓటు వేయడానికి అధికారులు అవకాశం కల్పించారు. దీంతో సమయం దాటినప్పటికీ పలు కేంద్రాల్లో ఓటర్ల క్యూ చోటు చేసుకుంది.



మోరాయించిన ఈవీఎంలు..

జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గంలోని పలుచోట్ల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు సాంకేతిక కారణాల వల్ల మొరాయించడంతో పలు కేంద్రాల్లో సోమవారం పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్‌లో గల జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని పోలింగ్ బూత్ నంబరు 137లో ఈవీఎం మోరాయించడం వల్ల సుమారు గంట పాటు ఆలస్యంగా ప్రారంభమైంది. మల్యాల మండలం రామన్నపేట గ్రామంలో 311 పోలింగ్ కేంద్రంలో, కోరుట్ల మండలం కిషన్ రావుపల్లిలో 109 పోలింగ్ కేంద్రంలో, వెల్గటూరు మండలం బీరుసాని పేట పోలింగ్ కేంద్రంలో, జగిత్యాల పట్టణంలోని 143, 184 పోలింగ్ కేంద్రంలో, పెగడపల్లి మండలంలోని దోమలకుంట 251 పోలింగ్ కేంద్రంలో, జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని 137 పోలింగ్ కేంద్రంలో, రాయికల్ మండలం మైతాపూర్ 45వ నంబరు పోలింగ్ కేంద్రంలో, ధర్మపురి మండలం తుమ్మనాలలోని 29వ నంబరు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడం వల్ల పోలింగ్ కొంత ఆలస్యంగా ప్రారంభమైంది.

బారుల తీరిన ఓటర్లు

జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో గల పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కు వినియో గించుకోవడానికి పలువురు భారీ క్యూ కట్టారు. ప్ర ధానంగా జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, రాయికల్, మెట్‌పల్లి ము న్సిపాలిటీలలో గల పలు కేంద్రాల వద్ద రెండు, మూడు వరసల్లో ఓటర్లు క్యూ కట్టి గంటల తరబడి వేచి ఉన్నారు. వేసవి కాలం కావడంతో ఉదయం వేళల్లోనే భారీ సంఖ్యలో పోలింగ్‌లో ఓటర్లు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం ఓటు వేసి పట్టణ ప్రాంతాల్లో గల తమ తమ యధావిధి పనులకు ఓటర్లు వెళ్లారు. మధ్యాహ్నం వేళలో కొంత మందకొడిగా ఓటింగ్ సరళి కొనసాగింది. తిరిగి సాయంత్రం వేళ మళ్లీ పుంజుకుంది.

సజావుగా పోలింగ్ ప్రక్రియ : కలెక్టర్

జగిత్యాల అర్బన్: జిల్లాలో లోక్ సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజా వుగా జరిగిందని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. సోమవారం పోలింగ్ జరిగిన సందర్భంగా విలేకరులకు వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని పోలింగ్ స్టేషన్‌లో కలెక్టర్ ఓటు హక్కును విని యోగించుకున్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో జిల్లా అధికార యంత్రాంగం, పోలీసుల సహకారాలతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తావులేకుండా పోలింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. జిల్లా మొత్తంగా మహిళా, దివ్యాంగులు, యువతకు సంబంధించిన మోడల్ పోలింగ్ కేంద్రాలు ప్రత్యేకంగా ఏ ర్పాటు చేశామని వివరించారు.

జగిత్యాలలో ఓటు వేసిన జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గల పోలింగ్ కేంద్రంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పలు పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజల నుంచి స్పందన లభిస్తుందన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరిన ఈవీఎంలు

ఎన్నికల మెటీరియల్స్‌తో వచ్చిన అధికారులు

జగిత్యాల: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి సోమవారం రాత్రి పోలింగ్ అధికారులు ఈవీఎంలతో చేరుకున్నారు. పోలింగ్ పూర్తి చేసుకున్న అనంతరం సీలు వేసిన ఈవీఎంలు, వీవీప్యాడ్‌లు, ఇతర పోలింగ్ సామగ్రితో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో ఎన్నికల అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలను తరలించడానికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ధర్మపురిలో పర్యటించిన అడ్లూరి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

ఓటుహక్కు వినియోగించుకున్న జడ్పీచైర్‌పర్సన్‌దంపతులు

జగిత్యాలరూరల్ : జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేటలోని తన స్వగ్రామంలో జగిత్యాల జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్ దంపతులు సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. జగిత్యాల అర్బన్ మండలం, రూరల్ మండలాల్లోని గ్రామాల్లో జడ్పీచైర్‌పర్సన్ వసంత, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీచైర్మన్ లోకబాపురెడ్డి పర్యటించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సరళి ప్రకారం ఫలితాలు బీఆర్‌ఎస్ కు అనుకూలంగా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

నిజామాబాద్‌లో 71.47శాతం..

నిజామాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. పోలింగ్ ముగిసే సమయానికి 71.47 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గాల వారిగా పరిశీలిస్తే పోలింగ్ శాతం కూడా కొంత మేర పెరిగింది. సాయంత్రం 6గంటల వరకు మరింత పోలింగ్ పెరిగింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో 68.37 శాతం పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో కొన్ని చోట్ల ఈవీ ఎంలు కూడా మొరాయించాయి.

పెద్దపల్లిలో 67.80 శాతం..

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అధికారులు అందించిన సమాచారం ప్రకారం మొత్తం పోలింగ్ 67.80 శాతం నమోదయ్యింది. నియోజకవర్గంలో 15,96,430 మంది ఓటర్లు ఉండగా, 10,82,379 మంది ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 71.34 శాతం, రామగుండంలో 61.59 శాతం, మంథనిలో 69.90 శాతం, మంచిర్యాలలో 59.78 శాతం, ధర్మపురిలో 73.74 శాతం, చెన్నూర్‌లో 68.13 శాతం, బెల్లంపల్లిలో 70.53 శాతం పోలింగ్ నమోదయ్యింది.

కరీంనగర్‌లో 5 గంటల వరకు 67.67 శాతం నమోదు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సాయం త్రం 5 గంటల వరకు 67.67 శాతం పోలింగ్ నమోదైంది. కరీంనగర్ నియోజక వర్గంలో 55.82 శాతం, చొప్పదండిలో 70.13 శాతం, వేములవాడ లో 71.26 శాతం పోలింగ్ నమోదయింది. అత్యధికంగా హుస్నాబాద్‌లో, అత్యల్పంగా కరీంనగర్‌లో 55.82 శాతం నమోదయింది.

ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామం అంతర్గాంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ రాధిక దంపతులు, మాజీరాష్ట్ర ఫైనాన్స్‌చైర్మన్ రాజేశం గౌడ్‌లు సోమవారం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బీ ఆర్ ఎస్‌నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఓటు కోసం అమెరికా నుంచి..

జగిత్యాల అర్బన్ : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవడానికి సోమవారం జగిత్యాల పట్టణంలో ఓ యువకుడు అమెరికా నుంచి వచ్చాడు. పట్టణంలోని శివ వీధికి చెందిన దర్శి తేజ అమెరికాలో మాస్టర్ కోర్సు చేస్తున్నాడు. పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో ఒక రోజు ముందే ఇండియాకు వచ్చే విధంగా ఫ్లయిట్ టిక్కెట్‌ను బుక్ చేసుకున్నాడు. పట్టణంలోని 190వ నంబరు పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కును వినియో గించుకున్నాడు.

కొడిమ్యాల : మండలంలోని నాచుపల్లికి చెందిన ఆకునూరి తిరుపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు రెండు రోజుల క్రితం దుబాయ్ నుంచి వచ్చాడు.



ఓటు హక్కు వినియోగించుకున్న బాజిరెడ్డి కుటుంబ సభ్యులు



నిజామాబాద్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న అర్వింద్, జగిత్యాలలో ఓటు వేసిన జీవన్‌రెడ్డి



ఓటు హక్కు వినియోగించుకున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ దంపతులు, ఓటు వేసిన జడ్పీ చైర్‌పర్సన్ దావవసంత దంపతులు, కుటుంబ సభ్యులతో ఎల్ రమణ, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

రాయికల్, మే 13: మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని డీసీఎంఎస్ వరిధాన్యం కొనుగో లు కేంద్రాన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న సమయంలో కనీస సౌకర్యాలైన టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలని సెంటర్ నిర్వాహకులకు, రైతులకు సూచించారు. రైతులు వరిధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవ ర్లు కప్పుకోవాలని, అలాగే కాంటా అయిన సంచులపై వర్షం వచ్చిన సమయంలో తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పి ఉండేలా చర్యలు తీసుకోవాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. తూకం వేసిన ధా న్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికా రుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారు లు డీటీసీఎస్ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆదర్శ పోలింగ్ కేంద్రం

జగిత్యాలరూరల్, మే 13 : జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ గ్రామంలో ఏర్పాటుచేసిన ఆదర్శపోలింగ్ కేంద్రం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కేంద్రాన్ని మామిడి ఆకులతో ద్వారాలు రూపొందించి పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లకు స్వాగతం పలికారు. దీనిని మామిడిపండ్ల ఆదర్శ కేంద్రంగా అధికారులు పేర్కొన్నారు. కాగా ఈ కేంద్రంలో ఓటువేసిన ఓటర్లు ప్రత్యేక అనుభూతిని ఆస్వాదించినట్లు తెలిపారు.

కరీంనగర్ ఓటర్లకు ధన్యవాదాలు

• మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మే 13: కరీంనగర్ ఓటర్ల ఆశీర్వచనంతో కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలవబోతున్నారని, ఓటర్లకు ధన్యవా దాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 200 యూనిట్లు పొందిన ఉచిత ఓటర్లుకు, ఆర్టీసీలో ప్ర యాణం చేసిన మహిళా ఓటర్లుకు, రూ.500కు గ్యాస్‌సిలిండర్లు లబ్ధి పొందిన ఓటర్లుకు, భవిష్యత్తులో ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఆకాంక్షించిన ఓటర్లుకు, 4 వేల రూపాయలు పెన్షన్ వసాయని ఆకాంక్షించిన ఓటర్లుకు, రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ ఆకాంక్షించిన ఓటర్లుకు, రిజర్వేషన్లు ఎత్తివేస్తారని కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓటర్లకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. వైశ మ్యాలు దూరంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ సరైనదని భావిం చి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యేక ధన్యవాదాలని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. హుస్నాబాద్, హుజూరాబాద్, మానకొండూర్, కరీంనగర్, చొప్ప దండి, వేములవాడ, సిరిసిల్ల ఓటర్లకు ధన్యవాదాలన్నారు.


పొన్నం ప్రభాకర్

గిరిజన గ్రామాల్లో వెల్లివిరిసిన చైతన్యం

- ఆదర్శంగా నిలిచిన చిన్నకొల్వాయి
- మధ్యాహ్నంలోగానే వందశాతం పోలింగ్ నమోదు
- సిబ్బందికి ఫోన్‌లో కలెక్టర్ అభినందన


చిన్నకొల్వాయి గ్రామం

బీర్‌పూర్, మే 13: జగిత్యాల జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామంలో చైతన్యం వెల్లివిరిసింది. అంతగా అక్షరాస్యత కూడా లేని గిరిజనులు తమ ఓటు హక్కు వినియోగించుకుని మధ్యాహ్నం 12 గంటలకే పోలింగ్ 100 శాతం నమోదు చేశారు. బీర్‌పూర్ మండలం న్నకొల్వాయి గ్రామంలో 165 మంది జనాభాకు గాను 94 మంది మహిళలు, 71 మంది పురుషులు ఉన్నారు. వీరిలో పురుషుల ఓటర్లు 45 కాగా మహిళలు 65 వీరంతా వ్యవసాయం చేస్తూ జీవిస్తారు. సోమ వారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఉదయం 7గంటల నుండి పోలింగ్ కేంద్రానికి చేరుకుని తమ ఓటు హక్కు వినియోగించుకుని సమాజానికి ఆదర్శంగా నిలిచారు. మారుమూల గిరిజన గ్రామంలో మధ్యాహ్నంవరకే పోలింగ్ 100శాతం నమోదు కావడం పట్ల జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని ప్రశంసించినట్లు సమా చారం. అదేవిధంగా ఎన్నికల సెక్టర్ అధికారి చెక్కు నాయక్, రూట్ ఆఫీసర్ రాజు కుమార్, కార్యదర్శులు ముద్దం విజయ, నారాయణ, అంగన్‌వాడీ టీచర్ బేరా యశోధ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

- ఓటు కోసం 1,300 కిలోమీటర్ల ప్రయాణం

చిన్నకొల్వాయి గ్రామానికి చెందిన కోట్నాక శ్రీను హరిప్రియలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సిరికోల్ జిల్లాలో ఓ మైనింగ్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడం కోసం భార్య హరిప్రియ తో కలిసి 1,300 కిలోమీటర్లు ప్రయాణించి వచ్చి ఓటు వేశాడు. ఇంతగా ఇబ్బందితో ఎందుకు వచ్చారని అడుగగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయ లేక పోయామని అందుకు చాలా బాధగా అనిపించి వచ్చామని వివరిం చారు. అలాగే గ్రామానికి చెందిన కోట్నాక తిరుపతి, చిక్రం బుచ్చి రాములు కూడా హైదారాబాద్ నుంచి ఓటు వేయడానికి రావడం విశేషం.



మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన దంపతులు



మొదటిసారి ఓటు వేసిన యువతులు

రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మ

- తొలగించిన పోలీసులు

ఎండపల్లి, మే 13: ఇటీవలే కురిసిన చిరుజల్లు వర్షానికి, ఈదురు గాలులకు మండం లోని శానబండ గ్రామంలో నడిరోడ్డుపై చెట్టు కొమ్మ విరిగి పడింది. ఎన్నికల విధులలో భాగంగా శానబండ వెళతున్న పోలీసులు తమ వాహనాన్ని ఆపి స్వయంగా పోలీసులు కొమ్మను పక్కకు తీసేసి గ్రామంలోకి వెళ్లారు. పోలీస్ సేవే కాకుండా సమాజ సేవ చేయడం పట్ల అటు నుండి వెళుతున్న ప్రయాణికులు ఫోటో తీసి గ్రామాలలోని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. వీరిని గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వేణు, కిరణ్, తిరుపతి పాల్గొన్నారు.


చెట్టు కొమ్మను తొలగిస్తున్న పోలీసులు

బీజేపీ కార్యకర్తపై దాడి

కథలాపూర్, మే 13: మండలంలోని చింతకుంటలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసు కుంది. ఎస్సై నవీన్ కథన ప్రకారం...పోలింగ్ జరుగు తున్న సమయంలో గ్రామం నుంచి వాహనంలో బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను తరలిస్తుండగా బీజేపీ కార్యకర్త నేతుల మల్లేశం అభ్యంతరం తెలిపాడు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లేశంను కొట్టడంతో పాటు టాటా ఏస్ వాహనం ఎక్కించారు. దీంతో మల్లేశం కాలు విరిగింది. వెంటనే చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి కరీంనగర్ పంపించామన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించడంతో పాటు దాడి చేసి న ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి కుటుంబాన్ని బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు సాయంత్రం పరామ ర్శించారు.

యువకుడిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, మే 13: మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన జయరాజ్ అనే యువకుడు ఓటు వేస్తు సెల్ఫీ దిగాడు. గ్రామంలోని 8వ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వెళ్లి సెల్ఫీ దిగినట్లు అధికా రులు గుర్తించారు. వెబ్ కెమెరాలను గుర్తించి పోలింగ్ సిబ్బంది ఉన్నతిధికారులకు చెప్పారు. యువకుడి నుంచి సెల్‌ఫోన్‌ను అధికారు స్వాధినం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

యువకులు, మహిళలపై ఇన్‌చార్జి ఎస్సై లాఠీచార్జి


స్థానికులపై లాఠీచార్జి చేస్తున్న ఎస్ఐ రమేశ్

ఎల్లారెడ్డిపేట, మే 13: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో విధులు నిర్వ హిస్తున్న ఇన్‌చార్జి ఎస్సై అల్లం రమేశ్ ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్‌లో సోమవారం అత్యుత్సాహం ప్రదర్శించారు. నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి బయట నిలబడిన యువకులు, మహిళలపై ప్రతాపం చూపారు. దుకాణాలు మూసి వేయా లంటూ హంగామా సృష్టించారు. ఎస్సీ కాలనీలోకి దూసుకెళ్లి యువకులు రొడ్డ మహేశ్, వేములవాడ పూర్ణచందర్‌తోపాటు మహిళలను లాఠీతో కొట్టారు. మహేశ్ కాలుపై వాతలు తేలాయి. కేంద్రానికి దూరంగా ఉన్న వంగ మల్లారెడ్డి ఇంటి వద్దకెళ్లి ఇక్కడేం చేస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లు తనదేనని చెప్పిన వినకుండా ఆధార్ కార్డు తీసుకురమ్మ న్నారు. ఆధార్ కార్డును చూపితే లాక్కొని అసభ్యపదజాలంతో దూషిం చారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఎస్సై రమేశ్ తీరుపై స్థానికులు, మహిళలు తిరగబడ్డారు. అకారణంగా చితకబాదా రంటూ నిలదీశారు. ఎస్సైకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు అక్కడకు చేరుకు న్నారు. పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న ఎందుకు కొడుతారని పోలీ సులను నిలదీశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ అక్కడికి చేరుకొని ఎస్సై రమేశ్‌ను అక్కడినుంచి పంపించారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు వెళ్లిపోయారు. ఎస్సై తీరుపై బాధితుడు మహేశ్ ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, స్థానిక నాయకులు తెలిపారు.


ఎస్ఐతో వాగ్వాదానికి దిగిన నాయకులు, స్థానికులు


బోనాలతో తరలివెళ్తున్న భక్తులు

గోరంటాలలో ఎల్లమ్మ సిద్దోగం ఉత్సవాలు

గంభీరావుపేట, మే 13: గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ సిద్దోగం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమ య్యాయి. సోమవారం నుంచి మంగళవారం వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. సోమవారం పుట్టకు ధని పోయడంలో భాగంగా బోనాలను ఊరేగింపుగా తీసు కెళ్లారు. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవా రం రాత్రి ఎల్లమ్మకు బోనాలను సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మొలకెత్తిన ధాన్యం .. అన్నదాతల ఆందోళన

ఎల్లారెడ్డిపేట, మే 13: కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు మొలకెత్తడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొనుగో ళ్లలో నెలకొంటున్న జాప్యంతో కేంద్రాల వద్ద రోజుల తరబడి ఎదురుచూ స్తున్న కర్షకులకు వర్షం మరో సమస్యగా మారింది. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి గత నెల 22న రైతు సంకూరి శంకర్ ధాన్యం తీసుకొచ్చారు. 17 శాతం తేమ నిబంధన ఉండటంతో వడ్లు ఆరబెట్టారు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షంతో ధా న్యం తడిసిపోయి మొలకెత్తింది. మొలకెత్తిన ధాన్యాన్ని వేరు చేసి ఆరబెట్టేం దుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతు శంకర్ వాపోయాడు. సుమారు 20 మంది రైతులకు సంబంధించిన ధాన్యం తడిసి పోయి మొలకలు వచ్చా యని తెలిపాడు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు.


రాజన్నపేటలో మొలకెత్తిన ధాన్యం


సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


కేశవపట్నంలోని మహిళా మోడల్ కేంద్రంలో...


వీణవంక పోలింగ్ కేంద్రంలో మహిళల క్యూ


కరీంనగర్‌లోని ముఖరంపుర ఉర్దూ మీడియం పాఠశాలలో

వెల్లువెత్తిన

ఓటరు చైతన్యం

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు ఉత్సాహంగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. యువత ఓటు వేయడానికి ఆసక్తి చూపించారు. మొదటి రెండు గంటల్లో మందకొడిగా ఓటింగ్ జరుగగా, 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో చాలా చోట్ల ఓటర్లు లేక పోలింగ్ కేంద్రాలు వెలవెలబోయాయి. తిరిగి సాయంత్రం 4 గంటలనుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



పెగడపల్లి మండలం ఆరవెల్లిలో మొదటిసారి ఓటు వేసిన యువత


సిరిసిల్లలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


ఇల్లందకుంట మండలం మల్లివానిపల్లెలో వృద్ధురాలు..


కాల్వశ్రీరాంపూర్‌లో వికలాంగుడిని వీల్‌చైర్‌లో తీసుకువస్తున్న తహసీల్దార్ జాహెద్‌పాషా


మల్యాలలో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తున్న సిబ్బంది


రాయికల్‌లో మొదటి సారి ఓటు వేసిన యువతులు


గోదావరిఖనిలో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు


కరీంనగర్‌లో తొలిసారి ఓటు వేసిన యువతులు



కరీంనగర్‌లో బారులు తీరిన ఓటర్లు



తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో మహిళా పోలింగ్ కేంద్రం


మెట్‌పల్లి మండలంలోని ఏఎస్ఆర్‌తండాలోని ట్రైబల్ మోడల్ కేంద్రం

కాంగ్రెస్ అభ్యర్థిపై ఫిర్యాదు

కరీంనగర్ క్రైం/భగత్‌నగర్,మే 13: కరీంనగర్ నియోజక వర్గం కాంగ్రెస్ అభ్యర్థిపై బీజేపీ నాయకుడు, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఈవీ ఎంలో నాల్గవ నెంబర్ కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 4వ నెంబర్ గల టీషర్టులు ధరించి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహించారన్నారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘించిన కాంగ్రెస్ అభ్యర్థిపై చర్యలు చేపట్టాలని బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై ఎన్నికల నియామవళి ఉల్లంఘనపై ఎన్నికల కేసు నమోదు చేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డిపేట, మే 13: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి శివారులోని కొత్తకుంట చెరువులో చేపల వేటకు వెళ్లి ఈ నెల 12న గల్లంతైన ఆలకుంట రాజు (35) మృతదేహం సోమవారం లభించినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. గొల్లపల్లికి చెందిన రాజు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి గ్రామ శివారులోని కొత్తకుంట చెరువులో చేపలకు వేటాకు వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు అదే రోజు రాత్రి గాలింపు చేపట్టారు. చీకటి ఉండడం.. వర్షం పడుతుండడంతో గాలింపునకు ఆటంకం ఏర్పడింది. సోమవారం ఉదయం కొత్తకుంట చెరువులో రాజు శవమై తేలాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, మే 13: మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం పశ్చిమ చంపార జిల్లాకు చెందిన సంజీవ్ మిశ్రా(49) అనే వ్యక్తి సీడ్ కంపెనీలో ప్రొడక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 6 గంటలకు వృత్తిలో భాగంగా జమ్మికుంట మండలం నగురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రాంపూర్ గ్రామంలోని హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనంపై అదుపు తప్పి డివైడర్‌ను కొట్టి కిందపడి పోయాడు. స్థానికులు వెంటనే ఆయనను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అమ్మవారి ఆశీస్సులు తీసుకుని.. అమ్మతో కలిసి

● ఓటు హక్కు వినియోగించుకున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 13: మహాశక్తి అమ్మవారి ఆశీస్సులు... అమ్మతో కలిసి నగరంలోని జ్యోతినగర్‌లోని 174 పోలింగ్ కేంద్రంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నగరంలోని మహాశక్తి దేశాలయంలో సతీసమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి ఆశీస్సులు తీసుకుని తల్లితో కలసి, కుటుంబ సభ్యులతో పాటు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

● పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన బండి

కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని పలు పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. నగరంలోని కిసాన్‌నగర్ కేంద్రం వద్ద ఓటర్లకు అభివాదం చేశారు. మానకొండూర్, వీణవంక, జమ్మికుంట, హుజూరాబాద్, సైదాపూర్, హుస్నాబాద్, చిగురుమామిడి, సిరిసిల్ల, వేములవాడలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.


విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న బండి సంజయ్ దంపతులు

అనుమానాస్పద స్థితిలో గొర్రెలు మృతి

రాయికల్, మే 13: మండలంలోని అయోధ్య గ్రామంలో యాదవ కులస్థులకు చెందిన 20 గొర్రెలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఒర్రె గంగమల్లయ్య, ఒర్రె రమేష్, ఒర్రె గంగరాజం దినసరి వృత్తిలో భాగంగా గొర్రెలు, మేకలను మేపుతుంటారు. ఈ క్రమంలో గొర్రెలు కొన్ని గంటల వ్యవధిలోనే అనుమానాస్పదంగా కిందపడి కొట్టుకుని మృతి చెందినట్లు గొర్రెల యాజమానులు తెలిపారు. పశువైద్యాధికారి శ్రీనివాస్‌కు సమాచారం అందించగా మృతిచెందిన గొర్రెలకు పంచనామా నిర్వహించి క్రిమిసంహారక మందులు తిని మరణించినట్లు తెలిపారు. ఈ క్రిమి సంహారక మందులు వన్యప్రాణులను వేటాడేందుకు పెట్టినవిగా స్థానికులు భావిస్తున్నారు. కాగా గ్రామానికి చెందిన ఒర్రె గంగ మల్లయ్యకు చెందిన 12 గొర్రెలు, మేకలు, ఒర్రె రమేష్‌కు చెందిన నాలుగు గొర్రెలు, ఒర్రె గంగరాజంనకు చెందిన నాలుగు గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.3 లక్షలకు పైగా ఆర్థికంగా నష్టపోయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ ఎడమల జీవన్‌రెడ్డి, యాదవ సంఘం మండల అధ్యక్షుడు వాసరి రవి యాదవ్ కోరారు.

ఓటు వేసే వీడియో సోషల్ మీడియాలో వైరల్

● ఇద్దరిపై కేసు నమోదు

జగిత్యాల టౌన్, మే 13: ఎంపీ ఎన్నికల పోలింగ్ సమయంలో ఓటు వేసి వీడియో తీసి ఈవీఎంతో పాటు బ్యాలెట్ పేపర్ కనబడే విధంగా సోషల్ మీడియాలో వైరల్ చేసిన ఇద్దరిపై జగిత్యాల టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఖిలాగడ్డకు చెందిన నదీమ్, సమీర్ అనే వ్యక్తులు ఈ చర్యకు పాల్పడ్డట్లు ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి కుమార స్వామి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

అంజన్న నిత్యాన్నదానంకు రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

మల్యాల, మే 13: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానంకు స్వామి వారి భక్తులు సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన డి.కృష్ణ వారి కుమారుడు అంజన్ ఈ విరాళంను అన్నదాన విభాగం ఇన్‌చార్జీ రాజేందర్ రెడ్డికి అందించారు. భక్తులు కొండగట్టులో నిర్వహిస్తున్న నిత్యన్నదాన పథకంకు విరివిగా విరాళాలు అందించాలని ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు కోరారు.

నృసింహ నవరాత్రోత్సవాలు ప్రారంభం


స్వామివారలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 13: ధర్మపురి క్షేత్రంలో నృసింహ నవరాత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5-30 గంటలకు అర్చకులు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నదికి బయలుదేరి వెళ్లారు. గోదావరి నదిలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి బిందె తీర్థం తీసుకువచ్చారు. ఉదయం 6-30 గంటలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కు మార్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వస్తి పుణ్యాహవచనం, రుత్విక్వరణం, కలశ స్థాపన, స్వామివారలకు పంచోపనిషత్తులచే అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు సహస్ర కలశ స్థాపన, నవగ్రహ, యోగినివాస్తు, క్షేత్ర పాలక స్థాపనలు, అర్చనాది ఆరాధన, హారతి పూజలు నిర్వహించారు.


బిందె తీర్థం తీసుకువస్తున్న అర్చకులు

చెట్టును ఢీకొట్టిన కారు : ముగ్గురికి గాయాలు

జమ్మికుంట రూరల్, మే 13: జమ్మికుంట మండలం తనుగుల గ్రామ మూల మలుపు వద్ద ఓ కారు చెట్టును ఢీకొన్న సంఘటనలో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. కాల్వశ్రీరాంపూర్ మండలం బేగంపేటకు చెందిన శ్రీనివాస్, రమ దంపతులు తమ కుమార్తెతో కలిసి ఓటు వేసేందుకు కారులో వరంగల్ నుంచి స్వగ్రామానికి వెళుతున్నారు. మార్గ మధ్యలో తనుగుల గ్రామ పరిధిలో మూల మలుపు వద్ద ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. అటువైపుగా వస్తున్న హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కార్యకర్తల సహాయంతో గాయపడ్డ వారిని 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఒకరి ఆత్మహత్య

పాలకుర్తి, మే 13: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈసాల తక్కళ్ళపల్లిలో సోమవారం ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు తిరుపతి(35) భార్య పుట్టింటికి వెళ్లి కొన్ని రోజుల నుంచి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 13: పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన నర్ర రాము(25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని నెలల క్రితం రాము తండ్రి మృతిచెందగా అప్పటినుంచి మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈ నెల 3న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా సోమవారం మృతిచెందాడు. మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

ఓటర్లకు డబ్బులు పంచిన ఇద్దరిపై కేసు

వీణవంక, మే13: మండలంలోని చల్లూరు, ఎలబాక గ్రామాల్లో ఓటర్లుకు డబ్బులు పంచుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరు గ్రామంలో పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు డబ్బులు పంచుతున్న బీజేపీ నాయకుడు రామిడి అదిరెడ్డిని ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ వడ్లకొండ ఐలయ్య పట్టుకొని 11వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఐలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలబాక గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు ఊట్ల దేవయ్య ఓటర్లకు డబ్బులు పంచుతుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్ రామ్‌కుమార్ పట్టుకొని 14 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. రామ్‌కుమార్ ఫిర్యాదు మేరకు దేవయ్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం పైనుంచి పడి ఒకరి మృతి

ముస్తాబాద్, మే 13 : మండలంలోని తుర్కపల్లె గ్రామానికి చెందిన అంకని భూమయ్య(56) అనే వ్యక్తి ద్విచక్రవాహనం పైనుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. తుర్కపల్లెకు చెందిన అంకని భూమయ్య పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పైనుంచి కిందపడి చనిపోయాడు. భూమయ్య కొడుకు అంకని సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కౌన్సిలర్ ఇంట్లో మద్యం పట్టివేత

సిరిసిల్ల టౌన్, మే 13: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ ఇంట్లో మద్యం పంచుతుండగా సోమవారం పార్లమెంట్ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్(బీఆర్ఎస్) దాదాపు లక్ష రూపాయలు విలువ చేసి మద్యం ఇంట్లో నిలవ చేసినట్లు తెలిసింది. శనివారం రాత్రి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలంటూ ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ మద్యంను పంచుతున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లడంతో సోమవారం దాడులు చేశారు. కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ ఓటర్లకు మద్యం పంచుతుండగా ఇంట్లోనే పట్టుకున్నారు. అధికారుల దాడిలో రూ. 25వేల విలువ చేసే మద్యం దొరికింది. కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్‌ను విచారణ జరిపి మద్యానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

వెల్లువెత్తిన ఓటర్లు



మల్లాపూర్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



మల్లాపూర్‌లో ఓటు వేసిన యువకులు



కోరుట్లలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

జిల్లాలో ఓటర్ల చైతన్యం వెల్లువెత్తింది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుదీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభం అయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను ప్రధాన పార్టీల అభ్యర్థులు సందర్శించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.

ధర్మపురి నియోజకవర్గంలో 73.34 శాతం పోలింగ్..

ధర్మపురి, మే 13: ధర్మపురి శాసనసభ నియోజక వర్గంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,30,786 మంది ఓటర్లు ఉండగా 73.34 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం పోలింగ్ ప్రారంభ సమయం వరకు అనేక గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. నియోజకవర్గ పరిధిలో తుమ్మెనాలలో 29వ నంబర్ పోలింగ్ కేంద్రంలో కొత్త ఓటరు ఓటు వేసే సమయంలో బటన్ గట్టిగా నొక్కడం వల్ల కిందికి పట్టుకుని అరగంట సేపు పోలింగ్ నిలిచిపోయింది. పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడం వల్ల కొంత సేపు పోలింగ్‌కు ఆటంకం కలిగింది. పలు పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సందర్శించి ఓటింగ్ తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. జగిత్యాల అడిషనల్‌ఎస్పీ వినోద్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటింగ్ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సహాయ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దివాకర టీఎస్ పోలింగ్ శాతం సమాచారం సేకరించారు. రాత్రి వరకు 9 గంటల వరకు కూడా అనేక పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకోలేదు.

● కోరుట్ల నియోజకవర్గంలో 73.85 శాతం నమోదు

కోరుట్ల: నిజామాబాదు పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో 73.85 శాతం ఓటింగ్ నమోదు అయినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కోరుట్ల ఆర్డీవో అనంద్‌కుమార్ తెలిపారు. పలు పోలింగ్ బూత్‌లను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పరిశీలించారు. కోరుట్ల పట్టణంలో ట్రైనీ ఎస్పీ శివం ఉపాధ్యాయ, మెట్‌పల్లి డీఎస్పీ ఆధ్వర్యం లో భారీ బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని 143 పోలింగ్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఓటు హక్కును వినియోగించుకున్నాడు. పట్టణంలోని వివిధ పోలింగ్ బూత్‌లను బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఓటంగ్ సరళిని తెలుసుకున్నారు. పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి సందర్శించారు.

● పట్టణంలోని అల్లమయ్య గుట్టు ప్రాంతంలోని 160 పోలిగ్ బూత్‌లో ఈవీఎం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో మోరాయించింది. దీంతో ఈవీఎం టెక్నీషియన్లు చేరుకుని సరిచేయడానికి మూడు గంటల సమయం పట్టింది. ఈవీఎంను సరిచేసి వేరే వీవీప్యాట్‌ను అమర్చారు. పోలింగ్ రాత్రి 8:30 నిమిషాల వరకు సాగింది.

● టెండర్ ఓటు వేసిన ఇద్దరు మహిళలు

మెట్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తమ ఓటును వేరేవారు వేయడంతో ఎన్నికల నిర్వాహకులు మెట్‌పల్లి పట్టణంలోని ఇద్దరు మహిళలకు టెండర్ ఓటు అవకాశం కల్పించారు. సోమవారం పట్టణంలోని 16వ వార్డుకు చెందిన జిన్నం లక్ష్మి, పెద్దగొండ లక్ష్మి ఓటును వినియోగించుకోవడానికి వెళ్లారు. పోలింగ్ కేంద్రంలోని ఎన్నికల నిర్వాహకులు పరిశీలించి మీ ఓటును వేరే వారు వేశారని తెలిపారు. కంగుతిన్న ఇద్దరు మహిళలు అధికారులను నిలదీశారు. దీంతో కొంత సమయం తర్వాత కేంద్రంలోని అధికారులు టెండర్ ఓటు అవకాశం కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 209 పోలింగ్ కేంద్రంలో ఇమ్రాన్ బదులు తండ్రి ఇమామ్ ఓటు వేశాడు. ఇమ్రాన్ ఓటు వేయకుండా వెనుదిరిగి వెళ్లాడు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఒకరికి బుదుల మరోకరు వేయడం, లిస్టులో ఓట్లు గల్లంతు జరిగినట్లు ఓటర్లు వాపోయారు.

మెట్‌పల్లి పట్టణంలోని జాగృతి మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెట్‌పల్లిలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలణాధికారి ఎలిస్ వజ్ ఆర్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పరిశీలించారు. డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి ఉన్నారు.

● ఓటర్లు ఎండలో.. వాహనాలు నీడలో

మెట్‌పల్లి పట్టణంలోని ఏకలవ్యనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఓటర్లు క్యూ కట్టడానికి ఎండలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాల ముందు రోడ్డు మీద కాకుండా ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో టెంట్లు వేయించారు. ఓటర్లకు వేయించాల్సిన టెంట్లు ఖాళీ ప్రదేశంలో వేయించడంతో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసినట్లు ఓటర్లు తీవ్ర విమర్శలు చేశారు.

● లోక్‌సభ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినయోగించుకోవడానికి మెట్‌పల్లి పట్టణానికి చెందిన కొమిరెడ్డి కపిల్ లండన్ నుంచి కుటుంబసభ్యులతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి రాములు, కొమిరెడ్డి జ్యోతిదేవి దంపతుల తనయుడు కొమిరెడ్డి కపిల్ ఉద్యోగ రీత్య కుటుంబ సభ్యులతో లండన్‌లో ఉంటున్నాడు.

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ అనుభంద గ్రామమైన కిషన్ రావు పల్లి గ్రామంలోని 109 పోలింగ్ బూత్‌లో ఈవీఎం 20 నిమిషాల పాటు మెరాయించంగా అధికారులు స్పందించి మరమ్మతు చేసి ప్రారంభించారు. మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన హోటల్ గంగమ్మ 108 ఏళ్ల వృద్ధురాలు 111 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మూటపెల్లిలో ఈవీఎంలపై ఒక పార్టీ సింబల్ ఎత్తైత్తుగా ఉండటంతో పోలింగ్ ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏజెంట్ల అభ్యంతరంతో సాంకేతిక నిపుణులతో అధికారులు మార్పులు చేయగా సజావుగా పోలింగ్ ప్రారంభమైంది. మండలంలోని ఇటిక్యాల, రాయికల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పరిశీలించారు. రాయికల్ పోలిగ్ కేంద్రాన్ని ట్రైనీ ఐపీఎస్ శివం ఉపాధ్యాయ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైతాపూర్ గ్రామంలోని 45వ నంబర్ పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ నిలిచిపోయింది. రాయికల్ పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి పరిశీలించారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జడ్పీటీసీ అశ్విని జాదవ్‌తో పాటు పలువురు నాయకులు, ప్ర జాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● రాయికల్ పట్టణానికి చెందిన అందె సత్యనారాయణ వయస్సు 65 సంవత్సరాలు. కానీ అతడు మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నాడు. అతనికి ఓటు హక్కు వచ్చి ఇన్ని సంవత్సరాలు అయినా గల్ఫ్‌కు వలస వెళ్లడంతో సెలవుకు ఇండియాకు వచ్చిన సమయాల్లో ఇప్పటివరకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం రాలేదు.

● కాంగ్రెస్ నాయకుల ఆందోళన

పోలింగ్ కేంద్రాల వద్ద కాంగ్రెస్ నాయకులను పరుష పదజాలంతో పోలీసులు దూషించడంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. నాయకులు వచ్చి సర్ది చెప్పడంతో గొడవ సర్దుమణిగింది. మండలంలోని కట్కాపూర్‌కు చెందిన భారతపు అనిల్ సింగాపూర్ దేశం నుంచి వచ్చి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నాడు. రామాజీపేట గ్రామానికి చెందిన గణేష్, మహేష్, ప్రవీణ్ దుబాయ్ నుంచి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కథలాపూర్: మండలంలోని 19 గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. మారుమూల ప్రాంతాలైన తుర్తి, పోతారం, ఇప్పపల్లి, చింతకుంట, కలికోట గ్రామాల్లో ఉత్సాహంతో ఓటర్లు తమ ఓటు వేసేందుకు క్యూ కట్టారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పోలింగ్ సరళిని తెలుసుకుని పలు గ్రామాల్లోని కార్యకర్తల నుంచి సమాచారం సేకరించారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని బండలింగాపూర్‌లోని 31వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మోరాయించడంతో 10 నిమిషాల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. వెల్లుల్లలో 85 ఏళ్ల వృద్ధులు, జగ్గసాగర్‌లోని యువత మొదటి సారిగా తమ ఓటు హక్కును వినియోగించుకోని అందరికి ఆదర్శంగా నిలించారు. అమెరికాలో చదువుకుంటున్న వేంపేట గ్రామానికి చెందిన ఏలేటి సమత, ఏలేటి రిషిక అనే అక్కాచెల్లెళ్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలో ఎస్సై కిరణ్‌కుమార్ దంపతులు, మొగిలిపేటలో టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావుతో పాటు పలువురు రాజకీయ నాయకులు, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించి పోలింగ్ నమోదు విరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కొడిమ్యాల: మండలంలో 74 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దారు టి. రాజమణి తెలిపారు. మండలంలోని నాచుపల్లి గ్రామంలో ఎంపీపీ స్వర్ణలత దంపతులు, హిమ్మతురావుపేటలో జడ్పీటీసీ ప్రశాంతి దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని పూడర్ గ్రామానికి చెందిన 78 ఏళ్ల పెద్ది మల్లమ్మను వీల్ చేర్‌లో సిబ్బంది పోలింగ్ కేంద్రానికి తరలించగా ఓటు హక్కు వినియోగించుకుంది.

ఇబ్రహీంపట్నం: మండలంలో ఓటింగ్ ప్రశాంతంగా జరగగా మండల కేంద్రంలోని పొలింగ్ కేంద్రాన్ని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్ కంతి మోహన్‌రెడ్డి ఇబ్రహీంపట్నంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బీర్‌పూర్: మండలంలోని చిన్నకొల్వాయిలో మధ్యాహ్నం 12 గంటల వరకే 100శాతం పోలింగ్ పూర్తి అయింది. గ్రామంలో ఓటర్లు 110 మంది ఉండగా స్త్రీలు 65 మంది, పురుషులు 45 మంది ఉన్నారు. వీరిలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సిరిగోల్ జిల్లాలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న కోట్నాక శ్రీను అతని భార్య హరిప్రియ 1300 కిలోమీటర్ల దూరం నుంచి ఓటువేయడానికి వచ్చారు. వీరిని పలువురు అభినందించారు. తుంగూర్ గ్రామంలో గొల్లపెల్లి రవీందర్ ఆనే వ్యక్తి ఓటు గల్లంతుకాగా పోలింగ్ కేంద్రం వద్ద రవీందర్ ఆందోళన చేశారు.

గోవిందారం పోలింగ్ స్టేషన్ వద్ద ఉద్రిక్తం

బీమారం: మండలంలోని గోవిందారం పోలింగ్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. గ్రామ కారోబార్ పోలింగ్ కేంద్రం వద్ద ఓ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నట్లు ఇతర పార్టీల నాయకులు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడంతో పోలింగ్ కేంద్రం వద్ద కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ విషయమై ఎంపీడీవో చిరంజీవిని వివరణ కోరగా ఆ గ్రామంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శికి అదనపు బాధ్యతలు అప్పజెప్పడంతో ఆ కార్యదర్శి ఆదేశాలనుసారం కారోబార్‌కు పోలింగ్ కేంద్ర బాధ్యతలు అప్పజెప్పడంతో సమస్య ఏర్పడిందన్నారు. తక్షణమే కారోబార్‌ను విధుల నుంచి తొలగిస్తున్నామని అధికారులు తెలిపారు.

మల్యాల: మండలంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. రామన్నపేట, మల్యాల, పోతారం గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో రామన్నపేటలో దాదాపు అరగంట తరువాత పోలింగ్ ప్రారంభం అయింది. పోలింగ్ శాతం పెంచడానికి గాను ప్రత్యేక ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా మల్యాలలో ఏర్పాటు చేసిన ఆదర్శ మహిళ పోలింగ్ కేంద్రంలో 20 మంది మహిళలకు వాయనం ఇచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు, యువత ఓటు హక్కు వినియోగించుకున్నారు. మల్యాల, తాటిపల్లి, నూకపల్లి, రామన్నపేట, ముత్యంపేట తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పోలింగ్ సరళి పరిశీలించారు. బల్వంతాపూర్‌లో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య కుటుంబసభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీఐ నీలం రవి ఆధ్వర్యంలో ఎస్సైలు అబ్దుల్‌రహీం, కుమారస్వామి గ్రామాల్లో పర్యవేక్షించారు.

జగిత్యాలరూరల్: మండలంలోని తిమ్మాపూర్, సోమన్‌పల్లి గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్‌కు కొంతమేర అంతరాయం కలిగింది. యువత, మహిళలు, వృద్ధులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి కనబరిచారు.

మల్లాపూర్: మండలంలోని వాల్గొండలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మోరాయించడంతో అరగంట అలస్యంగా పోలింగ్ ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. గ్రామంలోని 56వ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈవీఎం మొరాయించింది. దీంతో పోలింగ్ అరగంట సమయం అలస్యంగా ప్రారంభమైంది.

బుగ్గారం: మండలంలోని బీరుసాని గ్రామూంలో ఈవీఎం మొరాయించడంతో అరగంట తరువాత పోలింగ్ ప్రారంభం అయింది. మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పోలింగ్ సరళి పరిశీలించారు. స్థానిక ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఎండపల్లి: మండల కేంద్రంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. మండల కేంద్రంలో 80శాతం ఓటింగ్ నమోదైంది.

వెల్గటూర్: మండలంలోని బీరుసానిలో 66వ బూత్‌లో మాక్ పోలింగ్ అయిన తరువాత ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభం అయింది. పెద్దపల్లి ఎస్సీ పార్లమెంట్ పరిధిలో 42 మంది అభ్యర్థులు బరిలో నిలవడంతో అధికారులు మూడు ఈవీఎంలు ఏర్పాటు చేశారు. దీనితో వృద్దులతో పాటు చాలా మంది తాము ఓటు వేయాలనుకునే అభ్యర్థి ఏ ఈవీఎంలో ఉన్నారో చూసుకోవడానికి తికమక పడ్డారు. పోలింగ్ సరళిని బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మద్దతుదారులు పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై ఉమాసాగర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



మల్యాలలో ఓటు వేసిన యువతీయువకులు





ఓటు హక్కు వినియోగించుకున్న జువ్వాడి నర్సింగరావు, గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్



కోరుట్లలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధులు





చిన్నారితో ఓటు వేసిన దంపతులు.. ఓటు వేసిన యువతులు



మెట్‌పల్లిలో వీల్‌చైర్‌లో వృద్ధురాలిని తీసుకెళ్తున్న మున్సిపల్ కమిషనర్



గొల్లపల్లిలో కార్యకర్తలతో అడ్లూరి



కొడిమ్యాలలో ఓటర్ల క్యూ



బుగ్గారంలో క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు



కథలాపూర్‌లో క్యూలైన్

సీబీఎస్ఈ పది ఫలితాల్లో శ్రీచైతన్య, కేజీఆర్ ప్రభంజనం



శ్రీపురం కార్తీక్, బి ద్రితి

జగిత్యాలరూరల్, మే 13: సీబీఎస్ఈ పదోతరగతి ఫలితాల్లో జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ శ్రీచైతన్యపాఠశాల, మోతెలోని కేజీఆర్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం వెలువడిన ఫలితాల్లో 500 లమార్కులకుగాను శ్రీపురం కార్తీక్‌కుమార్ 469, బి. ద్రితి466, జవ్వాజి శ్రీలత465, బి. పూర్ణచందు461, జి. అభిరామ్ 459, ఎం. అక్షిత 455, బి. చరణ్454 మార్కులు, 23మంది విద్యార్థులు 400లకు పైగా మార్కులు సాధించినట్లు కరస్పాడెంట్ కె గంగారెడ్డి, డైరెక్టర్ కె. గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ సనత్‌కుమార్, పూర్ణచందర్ తెలిపారు.



జె శ్రీలత, బి పూర్ణచందు, జి అభిరామ్, ఎం అక్షిత, బి చరణ్

ఫలించిన పోలీసు వ్యూహం

కోరుట్ల, ధర్మపురి, జగిత్యాల సెగ్మెంట్‌లలో సజావుగా ఎన్నికలు

జగిత్యాల, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి పోలీసులు తీసుకున్న చర్యలు ఫలించాయి. పోలింగ్‌లో చిన్నాచితక మినహా ఎలాంటి హింసాత్మక సంఘటనలు, అల్లర్లు జరగకుండా ముగిసాయి. పోలింగ్ జరగడానికి కొద్ది రోజులుగా అల్లర్లకు పాల్పడే అవకాశాలున్న రాజకీయ పక్ష నాయకులను తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక ని ఘా వేసి ఉంచారు. అతి సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బలగాలు ఏ ర్పాటు చేశారు. నిర్మల్, కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న గ్రామాలు, గుట్టల వద్ద పోలీసులు కన్నేసి ఉంచారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2,500 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. పోలీసులు తీసుకున్న ముందస్తు చర్యల ద్వారా జిల్లాలో పోలింగ్ ఆశించిన స్థాయిలో జరిగి చెదురుమదురు సంఘటనలు మినహా ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ముగిసింది.



రాయికల్‌లో పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

తల్లి అంత్యక్రియలు పూర్తి చేసి పోలింగ్ కేంద్రానికి..

రాయికల్, మే 13: తల్లి మృతి చెందిన బాధను తట్టుకుని అంత్యక్రియలు పూర్తి చేసి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసిన తనయుడి ఘటన ఇది. రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన తోకల గంగాధర్ తల్లి మల్లు సోమవారం మృతి చెందింది. ఇదే రోజు పార్లమెంట్ ఎన్నికలు ఉండగా గంగాధర్ కుటుంబ సభ్యులు మల్లు అంత్యక్రియలు పూర్తి చేసిన అనంతరం గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి పుట్టెడు దుఃఖంలోనూ వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు.

రామాయణ నాటక ప్రదర్శన

మల్యాల, మే 13: మండలంలోని సర్వాపూర్‌లో సీతారామాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో చిరుతల రామాయణం సోమవారం ప్రారంభం అయింది. శ్రీభక్త మార్కండేయ నాటక కళామండలికి చెందిన కళాకారుల ప్రదర్శనలు ఈ సందర్భంగా ఆకట్టుకున్నాయి.